
కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి దంపతుల ఓటు


రాజమండ్రిలో ఓటేసిన జేసీ చినరాముడు


అనపర్తిలో ఓటేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


గోపాలపురంలో ఓటేసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


రాజమండ్రిలో ఓటేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు


నల్లజర్లలో ఓటేస్తున్న ముళ్లపూడి


ఓటేసి వస్తున్న అభ్యర్థి జీవీ సుందర్,శ్రీరామ్

గ్రాడ్యుయే ఓట్లు!


రాజానగరంలో ఓటర్ల క్యూ

పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం

- మందకొడిగా సాగిన పోలింగ్
- కేంద్రాల్లో కానరాని సందడి
- 4 గంటల్లో 20 శాతమే ఓటింగ్
- ఎక్కడికక్కడ ఎమ్మెల్యేల పర్యవేక్షణ
- చివరికి 69.5 శాతానికి చేరిక
- రాజశేఖర్..రాఘవుల మధ్యే పోటీ


కొవ్వూరులో ఓటేసిన కూటమి నాయకులు


బందోబస్తు ఏర్పాట్లపై ప్రశ్నిస్తున్న ఎస్పీ

(ఏలూరు/రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.ఎటువంటి వివాదాలకు తావులేకుండా జరిగింది. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరు కుంటారనే ఊహాలకు భిన్నంగా పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు నెమ్మ దిగా కొనసాగింది. అధికారులు నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ వచ్చారు. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతమే ఓట్లు పోలయ్యాయి.ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు.దీనికి భిన్నంగా ఆసాంతం ఓటర్లలో అలాంటి ఉత్సాహమే కనిపించలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇదే మాదిరి వాతావరణం కనిపించింది.దీంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నం నాటికే అప్రమత్తమయ్యారు. తొలి నాలుగు గంటల్లో మొత్తం కేవలం 20 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.ఈ పరిణామాన్ని గమనించి సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. స్వేచ్ఛగా ఓటు వేయడంటూ పట్టభద్రులకు మరోసారి విజ్ఞప్తిచేశారు.మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల్లో సాయంత్రం 4 గంటలకు సాఫీగా 69.50 శాతం పోలింగ్ నమోదైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులు మధ్య పోటీ హోరాహోరీగానే సాగినట్టే కనిపించింది.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.40
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	314984	2,18,902	69.50


కలెక్టర్ ప్రశాంతి పరిశీలన

అల్లూరి జిల్లాదే పైచేయి..

అతి తక్కువ ఓటర్లు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తం పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది.కేవలం 4,669 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3,637 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.90 శాతం మేర నమోదైంది. ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య కూడా అత్యల్పమే.

తూర్పున 67.41

తూర్పుగోదావరి జిల్లాలో పోలింగ్ మంద కొడిగానే సాగింది.ఏ పోలింగ్ కేంద్రం వద్ద పెద్దగా హడావుడి కనిపించలేదు. జిల్లాలో ఉదయం 8 గంటలకు ప్రారంభ మైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకూ జరిగింది. జిల్లాలో మొత్తం 67.41 శాతం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇంకా 20,524 మంది ఓట్లు వేయలేదు.చివరి గంటలో ఎక్కువ మంది రావడంతో స్లిప్‌లు ముందుగా ఇచ్చి వారితో ఓట్లు వేయించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఉదయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలింగ్ సరళి పరిశీలించారు.ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధి కారి టి.సీతారామమూర్తి పర్యవేక్షించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీ పరిశీలిస్తే గోపాలపురం నియోజకవర్గంలో అత్యధికంగా 72 శాతం,అనపర్తిలో 71.35 శాతం,నిడదవోలులో 70.15 శాతం, కొవ్వూరులో 66.5 శాతం, రాజమహేంద్రవరం 64.69 శాతం,రూరల్‌లో 64 శాతం, రాజానగరంలో 64 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో అత్యధికంగా రంగంపేట మండలంలో 81.14 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లాకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.


గెలుపు మనదే : నిడదవోలులో పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి దుర్గేష్, శేషారావు


ఓటేశాం : రాజమహేంద్రవరంలో ఓటేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


అంతా ఓకేనా : ధవళేశ్వరంలో ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు

ఆర్ఐవో నరసింహం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మార్చి 1 (శనివారం) నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు -2025 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్. నరసింహం తెలిపారు. 51 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు తాగునీరు, అత్యవసర మందులు వంటివి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. మొదటి ఏడాది జనరల్ 20591, ఒకేషనల్ 2226, రెండో ఏడాది జనరల్ 19062, ఒకేషనల్ 1875 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలను విద్యార్థులు ఒకరోజు ముందుగానే సందర్శించి.. పరీక్ష రోజుల అరగంట ముందుగా చేరుకొనే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు.ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని చెప్పారు.అందువల్ల చివరి నిమిషంలో ఇబ్బంది పడకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

నేడు పుష్కరాల రేవులో బోట్‌రేస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పుష్కరాల రేవులో గురువారం జరగాల్సిన బోట్ రేస్ శుక్రవారం ఉదయం 6 గంటలకు వాయిదా పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గురువారం రద్దు చేసి శుక్రవారం ఏర్పాటు చేశామని చెప్పారు.నదీ జలాలపై అవగాహక కల్పించడానికి ఈ బోట్ రేస్ ఏర్పాటు చేశామన్నారు. జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం, నదీ సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదే విధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం దగ్గర కాస్మోపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నీటి సంరక్షణ అంశంపై వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్కరఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

మంత్రిని కలిసిన సాయి పవన్


బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాయిపవన్‌ను అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో కాంస్య పతకం సాధించిన రాజమహేంద్రవరంనకు చెందిన క్రీడాకారుడు కర్రి సాయి పవన్ గురువారం మంత్రి కందుల దుర్గేష్‌ను కలిశారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ హల్ద్వానీలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ పోటీల్లో తాను సాధించిన కాంస్య పతకాన్ని చూపించారు. సాయిపవన్ తండ్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



- పయ్యావుల పద్దుపై ఆశలు
- కలగా ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ
- పనులు చేస్తామని బాబు, పవన్ హామీ
- సాగని ఏలేరు-తాండవ ప్రాజెక్టు
- రూ.వెయ్యి కోట్లకు డెల్టా ప్రతిపాదనలు
- కోటిపల్లి రైల్వే లైన్‌లో పడేనా!
- కాకినాడ స్మార్ట్ సిటీ మాటేంటో..
- సూపర్ సిక్స్ హామీలకు ఎదురుచూపులు
- ఉమ్మడి తూర్పునకు వరాల జల్లు కురిసేనా

నేడే కూటమి బడ్జెట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)
కూటమి బడ్జెట్ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఎదురుచూస్తోంది. నేడు రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్న పద్దు జిల్లాకు నిధుల వరద కురిపిస్తుందని నిరీక్షిస్తోంది. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేక జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో జరిగిన నష్టానికి నిధుల విడుదలతో చికిత్స చేస్తారని ఆశిస్తోంది. వర్షాలు, వరదలు వస్తే ముంపులో చిక్కుకుపోయి ఏటా ఉమ్మడి జిల్లాలో అనేక నియోజకవర్గాలు విలవిల్లాడిపోతున్నాయి. ఏళ్లకు ఏళ్లు ముందుకు కదలకుండా కలగానే మిగులుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ నుంచి అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ, ఆచరణకు నోచుకోని ఏలేరు-తాండవ కాలువ లింకింగ్, పూర్తికాని పోలవరం ఎడమ ప్రధాన కాలువ వరకు ఎన్నో సమస్యలు కూటమి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులతో తిరిగి పునరుజ్జీవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికలకు ముందు, ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటికి నిధులిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇవ్వడంతో ఈ మేరకు కేటాయింపులుంటాయని అంతా ఆశిస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్.. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతులకు నిధుల కేటాయింపులు ఏ మేర ఉంటాయనేది చర్చ నీయాంశంగా మారింది.

ఏలేరుకు మోక్షం లభించేనా..

కాకినాడ జిల్లాలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేసేసింది. ఇక అప్పటి నుంచి ఏలేరు ఆధునికీకరణ పక్కకు పోయింది. దీంతో వర్షాలు, వరద వచ్చిన ప్రతిసారీ ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. గతేడాది వరదలకు ఐదు వేల ఎకరాలు నీటమునిగాయి. అప్పట్లో సీఎం జగన్ గొల్లప్రోలు పర్యటనకు వచ్చినప్పుడు ఏలేరు ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. పాత అంచనాలను సవరించి కొత్తగా సిద్ధంచేసిన రూ.663 కోట్ల అంచనాలకు మోక్షం కలగలేదు. అనేక బడ్జెట్‌లు వెళ్లిపోయినా ఆధునికీకరణకు డబ్బులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలుసార్లు ప్రస్తావించారు. దీంతో ఈ బడ్జెట్‌లో ఈ పనులకు నిధులు ఏమేరకు కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా సవరించిన అంచనాలు రూ.794 కోట్లకు చేరాయి.

డెల్టా..ఆధునికీకరణ సంగతేంటో..

కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన డెల్టా ఆధునికీకరణ సైతం మూలనపడిపోయింది. గడచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు వరదలతో కోనసీమ అతలాకుతలమైంది. ఏటిగట్ల పటిష్టత చేపట్టలేదు.ఇప్పుడు డెల్టా ఆధుని కీకరణకు రూ.వెయ్యి కోట్లపైనే ఖర్చు కానుంది. సెంట్రల్ డెల్టాకు కీలకమైన లొల్ల లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు తక్షణవసరంగా మారింది. రూ.470కోట్లతో ఏలేరు-తాండవ లింకు కాలువ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా పనులు టెండర్ల దశలోనే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 214 కిలో మీటర్లు ఉన్న ఈ కాలువ ద్వారా కాకినాడ జిల్లాలో 1.67 లక్షల ఎకరాలు, కోనసీమ జిల్లాలో 2,326 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 81 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.3,645 కోట్ల పనులకు 72.7 శాతం పనులు పూర్తికాగా వైసీపీ హయాంలో ఎక్కడికక్కడ మిగిలిన పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచి పూర్తి చేయాల్సి ఉంది.

తల్లికి వందనం.. ఆర్‌టీసీ ప్రయాణం..

తల్లికి వందనం మే నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధులు అవసరం. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మందికి మేలు కలగనుంది. దీంతో మహిళల్లోనూ బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది.

స్మార్ట్‌సిటీకి నిధులిస్తారా...

కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులు ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం కూడా తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ వైసీపీ హయాంలో నిధులు విడుదల చేయలేదు. అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

కోటిపల్లి కూత పెట్టేనా..

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను జగన్ సర్కారులో కలగా మారింది. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ ఈ లైను పూర్తి చేస్తామని కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్ర వాటా నిధుల కింద కేటాయిం పులు జరగాల్సి ఉంది. దీంతో ఎన్ని నిధులు కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి 2001లో భట్నవిల్లి వద్ద శంకుస్థాపన చేసిన ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

సబ్బుపై సీవీ రామన్ చిత్రం

» సోప్ కార్వింగ్ ద్వారా చిత్రించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు



సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బుపై చెక్కిన సర్ సీవీ రామన్ చిత్రం, చిత్రించిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు సబ్బు బిళ్లపై ఆయన చిత్రాన్ని చిత్రించారు. సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బు బిళ్లను చెక్కి చిత్రించిన రామన్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. సర్ సీవీ రామన్ జీవితచరిత్ర గురించివిద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సబ్బుబిళ్లపై ఆయన చిత్రాన్ని చెక్కినట్లు గోవిందరాజులు తెలిపారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం

» సామర్లకోటలో రథంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు




రథోత్సవంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల.. స్వామి,అమ్మవార్లు

సామర్లకోట,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి,బాలాత్రిపురసుందరి అమ్మవార్ల రథోత్సవం గురువారం ఘనంగాజరిగింది. స్వామి,అమ్మవార్లు ఆశీనులు కాగా సర్వాంగ సుందరంగా అలంకరించిన రథం ముందుకు కదిలింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పల్లకిపై గాంధీ బొమ్మసెంటర్‌కు మంగళ వాయిద్యాల మధ్య భక్తులు తీసుకురాగా అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్నబాబు, వినయ్‌రథంవేదికపై అలంక రించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నంకుంభంపై పగులకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే చిన రాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎమ్మెల్యే రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, తలాటం సూర్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన రథోత్సవంలో వివిధ సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రదర్శనకారులు తమ కళలను ప్రదర్శించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఇంటి ఆవరణలో 5వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు.



ఊరేగింపులో ప్రదర్శనగా విచిత్ర వేషధారణలు

బహుముఖ ప్రజ్ఞాశాలి..

కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా

» సంఘ సంస్కర్తగా, కవిగా విశిష్టస్థానం
» ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర
» జాతీయ శాసన సభలో సభ్యుడు
» నేడు ఆయన 140వ జయంతి



(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

ఉన్నత పాఠశాలతోనే విద్యాభ్యాసం ముగిసినా 50కిపైగా పుస్తకాలు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా. సంఘ సంస్కర్తగా, కవిగా గుర్తింపు పొందిన ఈయన గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలోను కీలకపాత్ర పోషించారు. జాతీయ శాసనసభలో మరణించేవరకూ సభ్యుడిగాఉన్నారు.తన రచనలుప్రసంగాల ద్వారా స్వాతంత్ర్య సమరశంఖాన్ని పూరించారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్మాతిక పీఠం ఆరో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 1885, ఫిబ్రవరి 28న కాకినాడ జిల్లా పిఠాపురంలో మొహిద్దీన్‌బాద్‌షా, చాంద్‌బీబీ దంపతులకు జన్మించారు. తండ్రి వెంట ఉంటూ అరబ్బీ, పర్షియన్, ఉర్దూభాషలు నేర్చుకున్న ఈయన ఉన్నత పాఠశాలతోనే చదువులు ముగించారు. ఉమర్‌ఆలీషా 14వ ఏటనే చందోబద్ధంగా పద్యాలు రాయడంతోపాటు ధారాళంగా కవిత్వాలు చెబుతూ తన వంశ గురువైన అఖైలలీషాను స్తుతిస్తూ బ్రహ్మ విద్యావిలాసం అనే శతకాన్ని రచించారు. 18వఏట గద్య, పద్యాత్మకమైన మణిమాల నాటకాన్ని రాశారు. ఆయన 50కిపైగా గ్రంథాలు, పుస్తకాలను రచించారు. సామాజిక ఆధ్యాత్మిక ప్రయోజనమే లక్ష్యంగా, జాతీయభావం, సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, సర్వమత సమభావనలతోపాటు సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయం, ప్రజాచైతన్యాన్ని ఆశిస్తూ రచనలు సాగించారు. పండిత సమ్మేళనాల్లో శతావధానాలు చేశారు.

స్వాతంత్ర సమరయోధునిగా..

జాతీయ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటాలు, ఉద్యమాల్లో ఉమర్‌ఆలీషా పాల్గొన్నారు. మహాత్మా గాంధీతో విజయవాడలో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. 1924లో అఖిలభారత ఖిలావత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ముస్లిం లీగ్ మద్రాసు శాఖ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 1934 డిసెంబరులో ఉత్తర మద్రాసు నియోజకవర్గం నుంచి జాతీయ శాసనసభ సభ్యుడిగా ఎన్నికై 1945లో మరణించే వరకూ ఆ పదవిలో కొనసాగారు.

పలు పురస్కారాలు, పదవులు

విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరో పీఠాధిపతిగా 1928లో బాధ్యతలు చేపట్టిన ఆయన మరణించేవరకూ పీఠాధిపత్యం వహించారు. సర్వమతసమభావనా కేంద్రంగా పీఠాన్ని తీర్చిదిద్దారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం సభ్యుడిగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ముస్లిం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, భారతీయ జాతీయ కాంగ్రెస్ సభ్యుడి గా పనిచేశారు. ఈయనకు 1936లో ఇంట ర్నేషనల్ అకాడమీ ఆఫ్ అమెరికా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ప్రకటించింది. ఇంకా పలు బిరుదులు, పురస్కారాలు లభించాయి. 1945, జనవరిలో ఢిల్లీ నుంచి తిరిగి వస్తూ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వెళ్లిన ఉమర్‌ఆలీషా జనవరి 23న మరణించారు.

నేడు కాకినాడలో జయంతి సభ

కాకినాడ బోట్‌క్లబ్‌వద్ద శుక్రవారం ఉదయం కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సభ నిర్వహించనున్నారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్మాతిక పీఠం కాకినాడశాఖ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అంబరాన్నంటిన సంబరం

» పిఠాపురం పాదగయలో వైభవంగా నాకబలి- దండాడింపు-దొంగలదోపు ఉత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంపాదగయలో గురువారం జరిగిన నాకబలి-దండాడింపు-దొంగలదోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. పాదగయలోని రాజరాజేశ్వరీ



దొంగలదోపు ఉత్సవంలో రంగులు చల్లుతున్న అర్చకులు

సమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. నాకబలి-దండాడింపు-దొంగలదోపుఉత్సవంలో భాగంగా అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా కుంతీమాధవస్వామి దేవస్థానంవరకూ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, కింగ్‌కాంగ్ బొమ్మలు, శక్తి వేషధారుల ప్రదర్శనలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాదగయక్షేత్రం నుంచి ఉత్సవమూర్తులను తీసుకువెళ్తున్న పల్లకిని పోలీసులు మోసుకుని తీసుకువెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. పల్లకిని పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్‌ఐలు, పోలీసులు మోశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు, మునిసిపల్ కమిషనరు కనకారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార బ్రహ్మత్వంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి రథోత్సవం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్‌దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కుంతీ మాధవస్వామి కోనేరునుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు.



పిఠాపురం పాదగయ వద్ద శక్తి వేషధారణలో ప్రదర్శనలు

కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీబస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 50-57 ఏళ్ల మధ్య వయస్సున్న మగ వ్యక్తి మృతదేహం ఒంటిపై ఎరుపు, పచ్చ, తెలుపురంగుల గళ్ల చొక్కా, తెలుపు, నీలం రంగు లుంగీ ఉంది. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. వారికి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 94407966622, 08813-231100, 9154875583 నెంబర్లలో సమాచారం అందజేయాలని సీఐ విశ్వం తెలిపారు.

పీక కోసుకుని యువకుడి ఆత్మహత్య

తొండంగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేటలో గురువారం ఓ యువకుడు మనోవేదనకు గురై పదునైన కత్తితో పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన కుందేటి సత్యన్నారాయణమ్మ తన రెండో భర్తతో తమ్మయ్యపేటలో నివసిస్తోంది. ఆమె కుమారుడు కుందేటి లోవరాజు (28) జనవరి 8న భార్య నాగలక్ష్మి, రెండేళ్ల కుమారుడితో కలిసి తొండంగి మండలం తమ్మయ్యపేట వచ్చి ఉంటున్నాడు. భార్యభర్తలు గొడవపడడంతో ఫిబ్రవరి 6న భార్య పుట్టింటికి మురారి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మనోవేదనకు గురైన లోవరాజు మధ్యాహ్నం 3గంటలవేళ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు.



సంఘటనా స్థలంలో లోవరాజు మృతదేహం

తర్వాత ఫోను తల్లికి ఇచ్చి మేడపైకి వెళ్లాడు. అక్కడ ఉన్న సింటెక్స్ వాటర్ ట్యాంకుకు, గోడకు మధ్య కూర్చుని పదునైన వస్తువుతో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీని ఢీకొట్టిన బొలెరో

తృటిలో తప్పిన పెను ప్రమాదం



గండేపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం ప్రకారం హైదరాబాద్‌నుంచి విశాఖపట్నం ములక్కాడ లోడుతో వెళ్తున్న బొలెరో వ్యాన్ ముందు వెళ్తున్న ట్రాలీని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో అందరూ బయటపడ్డారు. ఒక్కసారిగా వ్యాన్ బోల్తా కొట్టడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక మహిళను గరికిన మహేష్ అనే యువకుడు 2022లో అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్‌ఐ నాగార్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోలీసులు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అనంతరం నిందితుడు మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు రాజమహేంద్రవరం 8వ జిల్లా సెషన్స్ జడ్జి, స్పెషల్ జడ్జి ఫర్ ట్రైల్ ఆఫ్ ఆఫన్సస్ అగైనెస్ట్ ఉమెన్ కేసులు కోర్టు మెజిస్ట్రేట్ వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుళ్లు ఏవీఎస్ఎన్ మూర్తి, ఎ.వెంకటేశ్వరరావులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

4 నుంచి ‘నన్నయ’లో నారీఫెస్ట్

» మొదటి రోజు మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు
» క్యాంపస్ మహిళలకు ప్రత్యేకం
» వర్సిటీ అనుబంధ కళాశాలల సిబ్బందికీ పోటీలు
» 6న ఘనంగా వేడుకలు
» ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మార్చి 4 నుంచి మూడురోజులపాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని గురువారం కోరారు.

రాజమహేంద్రవరం పరిసరాల్లో వారు అర్హులు

విశ్వవిద్యాలయంలో నారీఫెస్ట్ పోటీలు ప్రారంభమయ్యే మొదటిరోజు అనగా 4వ తేదీన మామ్మ(అమ్మమ్మ, నానమ్మ)-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో పోటీల్లో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని ఆడశిశువుల నుంచి వృద్ధ మహిళల వరకూ పాల్గొనవచ్చునన్నారు. ఆరోగ్యకరమైన శిశువుల ప్రదర్శనలో ఐదేళ్ల లోపు ఆడ, మగ శిశువులు పాల్గొనేందుకు అర్హులన్నారు. మామ్మ వయస్సు 60 నుంచి 80ఏళ్లు, మనవరాలు వయస్సు 5నుంచి 10ఏళ్ల మధ్య ఉండాలన్నారు. మహిళల్లో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనదలచిన వారు మార్చి 3వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను గానీ, విశ్వవిద్యాలయ ఉమెన్ సెల్‌ను గానీసంప్రదించాలన్నారు. హెల్దీబేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లకు ఫోన్‌చేస్తే పూర్తి వివరాలు తెలుపుతారన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని విద్యార్థినులకు, సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్యాంపస్ సిబ్బంది, విద్యార్థులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు.

5, 6 తేదీల్లో..

5న నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి సృజనాత్మక చేతి పనులు, చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, పూల అలంకరణ వంటి వివిధ పోటీలు విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం కుటుంబానికి చెందిన మహిళా సభ్యులు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 6న విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని వీసీ తెలిపారు. పోటీల్లో విజేతలకు నారీఫెస్ట్ కార్యక్రమంలో జ్ఞాపికలను, ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ఈ వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, మహిళలు ప్రదర్శిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలు విశ్వవిద్యాలయం మహిళా విభాగం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మహిళలందరూ ఈ కార్యక్రమాలకు హాజరై నారీఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

రసవత్తరంగా సాగిన సెమీఫైనల్స్

» ముగింపు దశకు చేరుకున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



సెమీఫైనల్స్‌లో తలపడుతున్న ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ మహిళల జట్లు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ముగింపు దశకు చేరుకుంది. గురువారం వివిధ రాష్ట్రాల మహిళల, పురుషుల మొత్తం నాలుగు మ్యాచ్‌లు సెమీఫైనల్లలో తలపడ్డాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్‌వర్మ, జిల్లా అటవీశాఖఅధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీకోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సాసెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఒడిస్సా సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 8-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, హర్యానా సెక్ర టేరియట్ పురుషులజట్ల మధ్య సెమీఫైనల్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 5-0తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులు ఎంతో నేర్చుకుంటారు



ఇటువంటి జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరుగుతూ ఉంటే వాటిని చూసి ఎంతోమంది క్రీడాకారులు ప్రేరణ పొందుతారు. సరైన సమయంలో శిక్షణ ఇస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా తయారవుతారు. నేను ఇలాంటి ప్రేరణతోనే ఇండియాజట్టు సభ్యుడిగా ఏషియన్ గేమ్స్‌లో హాకీ వరల్డ్‌కప్ ఆడగలిగాను. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి.

-ధనుంజయ్ మహాడి, అంతర్జాతీయ క్రీడాకారుడు, జీఎస్టీ, డిప్యూటీ కమిషనరు, మహారాష్ట్ర

కాకినాడలో మెరిసిన అంతర్జాతీయ క్రీడాకారులు



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి టోర్నమెంటుకి కాకినాడ వేదిక కావడంతో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు, ఆయా రాష్ట్రాల నుంచి వారి ప్రోత్సాహకులు కాకినాడ జిల్లా క్రీడా మైదానానికి తరలివస్తున్నారు. అంతర్జాతీయ టోర్నీల్లో వివిధ విభాగాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఒకేచోట కలవడంతో వారి క్రీడా విశేషాలను పంచుకున్నారు. ఇంటర్నేషనల్ హాకీ ప్లేయర్ సోనికా(ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ ఢిల్లీ), ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ చెరుకూరి పూర్ణిమ (ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ హైదరాబాద్, తెలంగాణ), ఇంటర్నేషనల్ అథ్లెట్ ఫిరోజ్ భాను (ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్, తెలంగాణ).. వీరు ముగ్గురూ హాకీ గ్రౌండ్‌లో మెరవడంతో అక్కడున్న క్రీడాకారులు వారిని ఆప్యాయంగా పలకరించి కాసేపు సరదాగా గడిపారు.

క్రీడలతోనే మంచి భవిష్యత్



1994లో స్పోర్ట్స్ కోటాలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్‌లో యూడీసీగా చేరాను. ఇప్పుడు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఆర్ఎస్‌బీ హైదరాబాద్ హాకీ టీం మేనేజరుగా కొనసాగుతున్నాను. క్రీడాకారులు ఆటపట్ల అంకితభావంతో ముందుకెళ్తే స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగంతో స్థిరపడే అవకాశముంది. క్రీడాకారులు ఇటువంటి టోర్నీల ద్వారా ప్రేరణ పొంది చక్క గా రాణించాలి.

-పి.వెంకటేశులు, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్, ఆర్ఎస్‌బీ హైదరాబాద్ టీం మేనేజరు

5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు సెలవు దినాలుగా ప్రకటించాలి

ఏపీ ఎన్జీజీవోస్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించేందుకు 5,6 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటించాలని ఏపీఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా క్రీడా మైదానంలో జరిగే ఈ ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

యానాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యానాం శివారు సావిత్రినగర్‌కు చెందిన యవకుడు పట్టా మోహన్(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యానాం సావిత్రినగర్‌లో ఉంటున్న మోహన్ చెడు అలవాట్లకు బానిసై అతడి మానసిక స్థితి పరిస్థితి బాగాలేదు. కుటుంబ వివాదాల నేపథ్యంలో తండ్రి ధర్మరావు ఏటిమొగలోను, తల్లి రమణ సావిత్రినగర్‌లోను ఉంటున్నారు. అతడు ఇంటికి వెళ్లకుండా తాను పనిచేస్తున్న బోటు వద్దే ఉంటున్నాడు. మానసికంగా సరిగా లేకపోవడంతో మోహన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు రెండోరోజుకు చేరుకున్నాయి. టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఈ టోర్నీని ఇటీవల మరణించిన క్రీడాకారుడు, అంతర్జాతీయ షటిల్ ఆటగాడు సాత్విక్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథానికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. గురువారం మొదటి మ్యాచ్ హూపర్స్ క్లబ్(ముంబై), కేరళ స్ట్రైకర్స్ మధ్య జరిగింది. నువ్వా.. నేనా అన్నట్టు జరిగిన మ్యాచ్‌లో బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో 3-2 తేడాతో హూపర్స్ క్లబ్ విజేతగా నిలిచింది. అనంతరం ఐటీ(చెన్నై), జీఎస్టీ(ముంబై) జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. అంతర్జాతీయ రిఫరీ ఎం.డానియేలు, జాతీయ రిఫరీలు నాగేశ్వరరావు, శివగిరి, ఎల్.జార్జి, ఆర్.సురేష్ సారధ్యంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో టోర్నీ కార్యవర్గం, వలంటీర్లు వీక్షకులకు అవసరమైన వసతి కల్పిస్తున్నారు. అధికసంఖ్యలో మహిళలుపోటీలను వీక్షించేందుకు తరలివచ్చారు.



హూపర్స్ క్లబ్, కేరళ జట్లు తలపడుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అదనపు ఛార్జీలు వేస్తే చర్యలు

» డెలివరీ బాయ్స్ తూకం మెషీన్ వెంట తీసుకెళ్లాలి
» గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, డెలివరీ బాయ్స్ సమావేశంలో జేసీ చినరాముడు


గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ డెలివరీ కోసం వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీలను వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ చినరాముడు హెచ్చరించారు. జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలపై అందుతున్న ఫిర్యాదుల మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, డెలివరీ బాయ్స్‌తో సమావేశం నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్స్ అదనపు ఛార్జీలను వసూలు చేయడం తక్షణమే నిలిపివేయాలని, 15 కిలోమీటర్ల పరిధి లోపల ఉన్న ఏ వినియోగదారుడి నుంచి డీలర్ అదనంగా వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. ఎమ్మార్పీ ధర కంటే అధికంగా, అదనపు ధర వసూలు చేసే అంశంపై గ్యాస్ ఏజెన్సీలు తమ డెలివరీ బాయ్స్‌ను హెచ్చరించాలని, లేకుంటే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే, గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్స్ తప్పనిసరిగా వేయింగ్ మెషీన్ వెంట తీసుకెళ్లాలని, వినియోగదారుని కోరికమేరకు సిలిండర్‌ను తూకం వేసి ఇవ్వాలని అన్నారు. సిలిండర్లను ర్యాండమ్‌గా చెక్ చేసి బరువు తక్కువుంటే వాటిపై కేసు నమోదు చేస్తామని, 19 కేజీల సిలిండర్‌పైన ప్యాకేజీ వివరాలు తప్పనిసరిగా ఉండాలని జేసీ పేర్కొన్నారు.

పందలపాకలో పీకేఎల్ కబడ్డీ పోటీలు

అనపర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 30వ తేదీ నుంచి బిక్కవోలు మండలం పందలపాకలో నిర్వహించే పీకేఎల్ 4 ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. గురువారం అనపర్తి మండలం రామవరంలో జరిగిన కార్యక్రమంలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పడాల వెంకటరామారెడ్డి, సబ్బెళ్ళ విజయభాస్కరరెడ్డి, వల్లూరి రామకృష్ణచౌదరి, పడాల వెంకటరామారెడ్డి, చంటి, వీరబాబు, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

'పల్ల' నర్సరీని సందర్శించిన ఇన్‌కంటాక్స్ డీజీ


నర్సరీని సందర్శిస్తున్న ఇన్‌కం టాక్స్ డైరెక్టర్ జనరల్

కడియం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని గురువారం ఇన్‌కం టాక్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఐటీ అధికారుల బృందం సందర్శించారు. ఆయనకు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్‌లు మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ కడియం నర్సరీల గురించి తాను విన్నానని, అందుకే నర్సరీ సందర్శనకు వచ్చినట్టు తెలిపారు. దేశ, విదేశీ మొక్కలు ఒకేచోటు కడియం ప్రాంతంగా చెప్పవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీ సెంట్రల్ ప్రిన్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ సతీష్‌వర్మ, కేంద్ర ఇన్‌కం టాక్స్ అధికారులు కల్యాణ్ చక్రవర్తి, ఎల్.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగంపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కళాశాలలో ఎ, బి సెంటర్లు ఏర్పాటు చేశామని, రెండు సెంటర్లలో మొదటి సంవత్సరం 763 మంది ద్వితీయ సంవత్సరం 486 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 'ఎ' సెంటర్‌కు బి.హేమ సీఎస్‌గా, ఏపీఆర్‌వీ ప్రసాద్ డీవోగా, 'బి' సెంటర్‌కు ఎస్.మాధురి సీఎస్‌గా, ఎంవీఎస్ కృష్ణ డీవోగా వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ హేమ పేర్కొన్నారు.

'సూపర్ సిక్స్' అమలుకు కూటమి కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే బత్తుల


రాజానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం ఆయన రాజానగరంలో పోలింగ్ ప్రక్రియపై కూటమి నాయకులతో కలిసి ఆరా తీశారు. ఈ సందర్భంగా విలేక రులతో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం రహదారులను గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 4,300 కిలో మీటర్ల వేసిన ఘనత కూటమి ప్రభుత్వాదేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ పాలనలో సీసీ రోడ్లు కూడా వేయలేకపోయారన్నారు. అలాగే ఉచిత ఇసుక, నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి తక్కువ రేట్లకు నాణ్యమైన మద్యం విక్రయాలు చేస్తోందన్నారు. ప్రభుత్వంలో రైతులకు రూ.16.70కోట్లు బకాయిలను చెల్లించడంతో పాటు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నామన్నారు. జీడి మామిడి గింజలకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. తల్లికి వందనం పథకం రానున్న జూన్ నాటికి అమల్లోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం యోచిస్తుంది. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ట్రాక్టరు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సీతానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం వీరేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో రాజానగరానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం తెల్లవారుజామున ఐదుదుగురు మిత్రులతో కలసి సరదాగా బయలుదేరి వంగలపూడి ర్యాంపు నుంచి ట్రాక్టర్ ఎక్కి ట్రక్ చివర కాళ్లు బయట పెట్టి కూర్చున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఈ ట్రాక్టర్‌ను రాసుకుంటూ వెళ్లడంతో రెండు ట్రాక్టర్ల మధ్య కాలు నలిగి మడం పైభాగంలో ఎముక బయటకు వచ్చింది. దీంతో అతడిని అదే ట్రాక్టరుపై రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అదే ట్రాక్టరుపై రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఏఎంటి ముత్యం శ్రీనివాస్ పైలట్ లక్ష్మణ్ ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రాజానగరం సీఐపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం, ఫ్రిబవరి 27(ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని భారతశక్తి పీఠం అధ్యక్షుడు, హిందూ మహాసభ దక్షిణ భారత కార్యనిర్వాహక కార్యదర్శి భారతానంద మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన గురువారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భారతానంద మాట్లాడుతూ.. గోవుల అక్రమ రవాణాకు పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపించారు. నిందితులకు రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ సహకరిస్తున్నారన్నారు. ఈ నెల 26న ఏపీ 39యూఎక్స్ 0181 లారీలోని కంటెయినర్‌లో సుమారు 40 గోవులను రవాణా చేస్తున్నారనే సమాచారంతో హిందూ గోసేవా సమితి సభ్యులకు సమాచారం వచ్చిందని, వాళ్లు రవాణాను అడ్డుకొని 112కి ఫోన్ చేసి అప్పగించారని చెప్పారు. అయితే ఆ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కి తరలించకుండా, హిందూ మనోభావాలు దెబ్బతినే విధంగా పోలీసులు ప్రవర్తించారని భారతానంద ఆరోపించారు. ఈ ఘటనపై ఎస్పీ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గోరంట్ల ఆర్థిక సాయం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు ఎన్.ముత్యాలరావు, బొడ్డు వెంకటేష్ కుటుంబాలను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి పరామర్శించారు. జాలరిపేటలోని బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి యువకుల ముత్యాలరావు పరామర్శించి సంతాపం తెలిపారు. తన సొంత సొమ్ము రూ.1లక్ష చొప్పున అందజేశారు. పార్టీ పరంగా, ప్రభుత్వం పరంగా రెండు కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, తలారి మూర్తి, పుక్కళ్ళ రాజు, అచ్యుత్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ సీతానగరం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



సీతానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందన పిర్ల వెంకటేశ్వర్లు (గణేష్‌యాదవ్) ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు. గణేష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

ఓటు పడింది!

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్


కోరుకొండలో ఓటు వేసేందుకు బారులు తీరిన గ్రాడ్యుయేట్లు

» ఉదయం మందకొడిగా ఆరంభం
» మధ్యాహ్నానికి పుంజుకున్న వైనం
» సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్
» రంగంపేటలో అత్యధికం
» ధవళేశ్వరంలో అత్యల్పం


పోలింగ్‌బూత్ వద్ద పరిస్థితి తెలుసుకుంటున్న ఎస్పీ కిశోర్

రాజానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం తొలుత మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి జోరందుకుంది. తర్వాత వేగం పుంజుకుంది. ప్రశాంతంగా ముగిసింది. రాజానగరం మండలంలో ఉన్న 2,522 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకుగానూ స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని తహశీల్దార్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య కార్యాలయ భవనాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి గంటల కొద్దీ నిరీక్షించారు. కొంతమంది ఓటర్లు ఒక అభ్యర్థి కంటే ఎక్కువ మందికి ప్రాధాన్య ఓట్లు వేసి ఉంటారని అందుచేతనే పోలింగ్ ఆలస్యం అవుతోందని కేంద్రాల వద్ద పలువురు అభిప్రాయాలు వ్యక్తంచేశారు. మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన 79వ పోలింగ్ కేంద్రంలో అదనపు కంపార్టుమెంటును ఏర్పాటు చేశారు. రాజానగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లోనూ మొదటి గంటన్నర వ్యవధిలో 8శాతం మంది


సీతానగరంలో పోలింగ్ బూత్ వద్ద రెవెన్యూ సిబ్బంది

మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం ఓటర్లు 2,522 మందికిగానూ 1582 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 62.73శాతంగా నమోదైనట్టు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, స్థానిక తహశీల్దార్ అనంతలక్ష్మి సత్యవతి దేవి తెలిపారు.

తగ్గిన ఓటింగ్ శాతం

సాధారణ ఎన్నికల వలె కాకుండా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటింగ్ శాతం బాగా తగ్గిపోవడం పట్ల పలువురు నాయకులు, వివిధ సంఘాల వారు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. విద్యావంతులై ఉండి ఓటు విలువ తెలిసిన వారు సైతం ఓటింగ్‌లో పాల్గొనకపోవడానికి గల కారణాలను వారు విశ్లేషించారు. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారికి పోలింగ్ సందర్భంగా ప్రభుత్వం పూర్తిగా సెలవును ప్రకటించకపోవడం, అలాగే స్థానికంగా నమోదై ఉండి ఉద్యోగాల నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులు ఎన్నికలపై ఆసక్తి చూపకపోవడం, అభ్యర్థులెవరూ తాయితాలు పంచకపోవడం వంటివి ఓటింగ్ శాతం తగ్గడానికి కారణాలుగా తెలుస్తోంది. ఇంతేకాకుండా ఈవీఎంల ద్వారా కాకుం డా బ్యాలెట్ పత్రాలపై ప్రాధాన్య ఓట్లు వేయాల్సి రావడం కూడా మందకొడి పోలింగ్‌కు మరో కారణం

ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌ దరి కూటమి పార్టీ నాయ కులు, కార్యకర్తలతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఓటింగ్ వేగవం తంగా జరిగేలా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు చేశారు. కాగా డీఎస్పీ వై.శ్రీకాంత్ స్థానిక సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సిబ్బందికి పలు సూచన లిచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా సీఐ వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా తహశీల్దార్ జీ అనంతలక్ష్మి సత్యవతిదేవి పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సరళిని పరిశీలిస్తూ, ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా త్వరగా పోలింగ్ జరిగేలా పర్యవేక్షించారు.

రంగంపేటలో 81.14 శాతం

రంగంపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 44, 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 1289 మంది ఉండగా 1046(81.14 శాతం) ఓట్లు పోలయ్యాయని, 899 మంది పురుషులకు గాను 738 మంది, 390 మంది స్త్రీలకు గాను 308 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహశీల్దార్ కోసు అనసూయ తెలిపారు. పోలింగ్ ప్రక్రియను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల పరిశీలికుడు చింతల రామకృష్ణ, ఆళ్ల గోవింద్, కూటమి నాయకులున్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో 64 శాతం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో 6,409 ఓట్లు ఉండగా పోలింగ్‌లో 63.47శాతం నమోదయింది. 4068 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలం పరిధిలో ధవళేశ్వరంలో 2, బొమ్మూరులో 1, హుకుంపేటలో 2, కొంతమూరులో 4 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం అర్బన్ 64.69శాతం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 21 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. మొత్తంగా 62శాతం ఓట్లు పోలయ్యాయి. లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్, మల్లికార్జుననగర్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, వీవర్స్‌కాలనీ నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్,సీతంపేట పంతం సత్యనారాయణ ప్రాథమిక పాఠశాల, వీరభద్రపురం టౌన్


రాజమహేంద్రవరంలో ఓటేసిన అనుశ్రీ దంపతులు

హైస్కూల్, నన్నయ మునిసిపల్ హైస్కూల్, కోర్లంపేట కుసుమనాగన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, ఏసీ గార్డెన్స్ శ్రీనివాసరామానుజం మునిసిపల్ హైస్కూల్, ఇన్నీసుపేట గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్, గవర్నమెంట్ కళాశాల, నారాయణ పురం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, దానవాయిపేట మునిసిపల్ స్కూల్, ట్రైనింగ్ కళాశాలలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 16,938 మంది ఓటర్లకు గాను 10,501 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 6,437 మంది ఓట్లు వేయలేదు. రాజమహేంద్రవరంలో ప్రజాప్రతినిధులు, కొందరు ముఖ్యనేతలు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ట్రైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వారు పోలింగ్ కేంద్రం బయటకు వచ్చి ఓటు హక్కు వేసిన వేలుపై సిరాను చూపించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పట్టభద్రులంతా వివేకంతో విజ్ఞతతో ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హ క్కును పట్టభద్రులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ సీనియర్ నేత గన్ని కృష్ణ టౌన్ హైస్కూల్‌లోను, వీఎల్ పురం శ్యామలాంబ ఉన్నత పాఠశాలలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, లాలాచెరువు మునిసిపల్ స్కూల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కు మార్, ప్రభుత్వ గరల్స్ హైస్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఓట్లు వేశారు. జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ (అత్తి) సత్యనారాయణ తన సతీమణి అనురాధదేవితో కలసి దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి జీవి సుందర్, ఆయన సోదరుడు జీవీ శ్రీరాజ్ స్థానిక వీరభద్రపురం స్కూల్లో ఓటు వేశారు.

ధవళేశ్వరంలో 60.60శాతం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 72, 73వ పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1950 ఓట్లకు గాను 1185 ఓట్లు పోలయ్యాయి. 72వ బూత్‌లో 643 ఓట్లు, 73వ బూత్‌లో 542 ఓట్లు చొప్పున 60.60శాతం ఓటింగ్ శాతం నమోదయింది. ఉదయం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ విచ్చేసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విచ్చేసి పోలింగ్ సరళిని సమీక్షించారు. సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పోలింగ్‌బూత్ పరిసర ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు.


బందోబస్తుపై ప్రశ్నిస్తున్న జేసీ చినరాముడు

కడియంలో 71.86శాతం

కడియం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 989 మందికి గాను 685 మంది, కడియం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 916 మందికి గాను 684 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71.86 పోలింగ్ శాతం నమోదయినట్టు ఇన్‌చార్జి తహశీల్దారు ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. కడియంలో జరిగిన పట్టభద్రుల ఎన్నికల కేంద్రాల సమీపంలో కూటమి నాయకులతో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌లు భేటీ అయ్యారు. పోలింగ్ ప్రక్రియ తీరు, నమోదు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, పంతం గణపతి, ఆదిమూలం సాయి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, తోరాటి శ్రీను, పాతూరి రాజేష్ తదితరులున్నారు.

గోకవరంలో 76శాతం

గోకవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 46వ పోలింగ్ బూత్‌లో 815 మందికి గాను 615 మంది, ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన 47వ పోలింగ్ బూత్‌లో 766 మందికి గాను 588 మంది ఓటు హక్కురే వినియోగించుకున్నారని, 76శాతం ఓట్లు పోలైనట్టు తహశీల్దారు ఎం.సాయిప్రసాద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పోలింగ్ కేంద్రం సమీపంలో టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కూటమి శిబిరం వద్దకు చేరుకొని ఎన్నికల సరళిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అప్పటికే పోలింగ్ కొద్దిగా మందకొడిగా సాగుతున్న విషయాన్ని తెలుసుకొని మరింత పెరగాలని నాయకులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

సీతానగరంలో 70శాతం

సీతానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సీతానగరం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 50, 51 పోలింగ్ కేంద్రాల్లో 70శాతం ఓట్లు పోలయినట్టు తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. 1516 ఓట్లకు గాను రెండు పోలింగ్ బూత్‌లలో కలిపి 1,067 ఓట్లు పోలైనట్టు చెప్పారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ ఆధ్వర్యలో రెవెన్యూ సిబ్బంది ఓటర్లకు స్లిప్పులు అందజేశారు.

కోరుకొండలో 70.05 శాతం

కోరుకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పా టు చేసిన మూడు పోలింగ్ బూత్‌ల్లో పో లింగ్ జరిగింది. మొత్తం 1806 ఓటర్లకు గాను1274 మంది(70.05 శాతం) ఓటుహక్కును వినియోగించుకున్నారు. కోటికేశవరం గ్రామానికి చెందిన భార్యాభర్తలు 6నెలల పసిపాపతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓట్లు వేశారు. మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు ఉన్నాయి. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీఐ సత్యకిషోర్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు. తహశీల్దార్ సుస్వాగతం


రంగంపేటలో టీడీపీ నేత జవహర్

పోలింగ్ సరళిని పరిశీలించారు. కాగా కూటమి అభ్యర్థి గెలుపు కోసం రెండు శిబిరాలను ఏర్పాటు చేసుకుని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు ఆధ్వర్యంలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేశారు.

అనపర్తిలో 71.35శాతం

అనపర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, నెం-2 ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో 2349మంది ఓటర్లుకు గాను పురుషులు 1055మంది, మహిళలు 621మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ఎన్నికలను పర్యవేక్షించారు. మొత్తం పోలింగ్ శాతం 71.35గా నమోదైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

అంతా ప్రశాంతం : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ నరసింహకిశోర్ పేర్కొన్నారు. ఉదయం నుంచే ఆయన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ సరళిపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీస్‌లతో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన చెప్పారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో పోలింగ్, మొబైల్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు.


కొంతమూరులో ఓటర్లకు స్లిప్‌లు ఇస్తున్న ఎన్నికల సిబ్బంది

బిక్కవోలులో 66శాతం

బిక్కవోలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 66శాతం మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యకృష్ణ తెలిపారు. మండల పరిధిఓ మొత్తం 1934 మంది ఓటర్లు వుండగా వీరిలో 804మంది పురుషులు, 479 మంది స్త్రీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట కూటమి నాయకులు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, రావాడ నాగు, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చింతా శ్రీనివాసరెడ్డి, తనుకు శ్రీధర్, కానాటి అప్పలస్వామి తదితరులు ఉన్నారు.


కడియంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల


గోకవరంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నెహ్రూ

'స్వర్ణాంధ్ర'లో అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాచెరువు వద్ద స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో అనూప్, జోషిబాబు, ప్రభుదాస్, పోసికుమార్, మద్దాల అను, శకుంతల, లక్ష్మణరావు, రుద్రమదేవి, సురేష్, కుసుమ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అనపర్తిలో చికెన్ మేళా

అనపర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చికెన్, గుడ్డు తినడం వల్ల ఎటువంటి హాని జరగదని, ప్రజల్లో బర్డ్‌ఫ్లూపై ఉన్న అపోహలను తొలగించేందుకు శుక్రవారం చికెన్ మేళా నిర్వహించనున్నట్టు లక్ష్మీ ప్రసన్న పౌల్ట్రీ అధినేత మేడపాటి చెల్లారెడ్డి గురువారం తెలిపారు. అనపర్తిలో హెన్‌కాఫ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుపుతామని పేర్కొన్నారు



గెలిచేది.. నువ్వా..నేనా

వన్‌కే వేశా : ఐ.పోలవరంలో ఓటేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం

నాది వన్‌కే : కపిలేశ్వరపురంలో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులు



కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి దంపతుల ఓటు



రాజమండ్రిలో ఓటేసిన జేసీ చినరాముడు



అనపర్తిలో ఓటేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



గోపాలపురంలో ఓటేసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



రాజమండ్రిలో ఓటేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



నల్లజర్లలో ఓటేస్తున్న ముళ్లపూడి



ఓటేసి వస్తున్న అభ్యర్థి జీవీ సుందర్,శ్రీరామ్

గ్రాడ్యుయేట్ ఓట్లు!



రాజానగరంలో ఓటర్ల క్యూ



కొవ్వూరులో ఓటేసిన కూటమి నాయకులు



బందోబస్తు ఏర్పాట్లపై ప్రశ్నిస్తున్న ఎస్పీ

పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం

- మందకొడిగా సాగిన పోలింగ్
- కేంద్రాల్లో కానరాని సందడి
- 4 గంటల్లో 20 శాతమే ఓటింగ్
- ఎక్కడికక్కడ ఎమ్మెల్యేల పర్యవేక్షణ
- చివరికి 69.5 శాతానికి చేరిక
- రాజశేఖర్..రాఘవుల మధ్యే పోటీ

(ఏలూరు/రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.ఎటువంటి వివా దాలకు తావులేకుండా జరిగింది. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరు కుంటారనే ఊహలకు భిన్నంగా పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు నెమ్మ దిగా కొనసాగింది. అధికారులు నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ వచ్చారు. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతమే ఓట్లు పోలయ్యాయి.ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు.దీనికి భిన్నంగా ఆసాంతం ఓటర్లలో అలాంటి ఉత్సాహమే కనిపించలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇదే మాదిరి వాతావరణం కనిపించింది.దీంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నం నాటికే అప్రమత్తమయ్యారు. తొలి నాలుగు గంటల్లో మొత్తం కేవలం 20 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.ఈ పరిణామాన్ని గమనించి సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. స్వేచ్ఛగా ఓటు వేయడంటూ పట్టభద్రులకు మరోసారి విజ్ఞప్తిచేశారు.మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల్లో సాయంత్రం 4 గంటలకు సాఫీగా 69.50 శాతం పోలింగ్ నమోదైంది.కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులు మధ్య పోటీ హోరాహోరీగానే సాగినట్టే కనిపించింది.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.40
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	314984	2,18,902	69.50



కలెక్టర్ ప్రశాంతి పరిశీలన

అల్లూరి జిల్లాదే పైచేయి..

అతి తక్కువ ఓటర్లు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తం పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది.కేవలం 4,669 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3,637 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.90 శాతం మేర నమోదైంది. ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య కూడా అత్యల్పమే.

తూర్పున 67.41

తూర్పుగోదావరి జిల్లాలో పోలింగ్ మంద కొడిగానే సాగింది.ఏ పోలింగ్ కేంద్రం వద్ద పెద్దగా హడావుడి కనిపించలేదు. జిల్లాలో ఉదయం 8 గంటలకు ప్రారంభ మైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకూ జరిగింది. జిల్లాలో మొత్తం 67.41 శాతం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.జిల్లాలో మొత్తం 62,970 మంది ఓటర్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇంకా 20,524 మంది ఓట్లు వేయలేదు.చివరి గంటలో ఎక్కువ మంది రావడంతో స్లిప్‌లు ముందుగా ఇచ్చి వారితో ఓట్లు వేయించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఉదయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలింగ్ సరళి పరిశీలించారు.ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధి కారి టి.సీతారామమూర్తి పర్యవేక్షించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీ పరిశీలిస్తే గోపాలపురం నియోజకవర్గంలో అత్యధికంగా 72 శాతం,అనపర్తిలో 71.35 శాతం,నిడదవోలులో 70.15 శాతం, కొవ్వూరులో 66.5 శాతం, రాజమహేంద్రవరం 64.69 శాతం,రూరల్‌లో 64 శాతం, రాజానగరంలో 64 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో అత్యధికంగా రంగంపేట మండలంలో 81.14 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లాకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.



గెలుపు మనదే : నిడదవోలులో పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి దుర్గేష్, శేషారావు



ఓటేశాం : రాజమహేంద్రవరంలో ఓటేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



అంతా ఓకేనా : ధవళేశ్వరంలో ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు

ఆర్ఐవో నరసింహం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మార్చి 1 (శనివారం) నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు -2025 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్. నరసింహం తెలిపారు. 51 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు తాగునీరు, అత్యవసర మందులు వంటివి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. మొదటి ఏడాది జనరల్ 20591, ఒకేషనల్ 2226, రెండో ఏడాది జనరల్ 19062, ఒకేషనల్ 1875 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలను విద్యార్థులు ఒకరోజు ముందుగానే సందర్శించి.. పరీక్ష రోజుల అరగంట ముందుగా చేరుకొనే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు.ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని చెప్పారు.అందువల్ల చివరి నిమిషంలో ఇబ్బంది పడకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

నేడు పుష్కరాల రేవులో బోట్‌రేస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పుష్కరాల రేవులో గురువారం జరగాల్సిన బోట్ రేస్ శుక్రవారం ఉదయం 6 గంటలకు వాయిదా పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గురువారం రద్దు చేసి శుక్రవారం ఏర్పాటు చేశామని చెప్పారు.నదీ జలాలపై అవగాహన కల్పించడానికి ఈ బోట్ రేస్ ఏర్పాటు చేశామన్నారు. జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం, నదీ సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదే విధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం దగ్గర కాస్మోపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నీటి సంరక్షణ అంశంపై వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్కరఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.అనంతరం విజేతలకు బహుమతి ప్రధానం ఉంటుందని తెలిపారు.

మంత్రిని కలిసిన సాయి పవన్



బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాయిపవన్‌ను అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో కాంస్య పతకం సాధించిన రాజమహేంద్రవరంనకు చెందిన క్రీడాకారుడు కర్రి సాయి పవన్ గురువారం మంత్రి కందుల దుర్గేష్‌ను కలిశారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ హల్ద్వానీలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ పోటీల్లో తాను సాధించిన కాంస్య పతకాన్ని చూపించారు. సాయిపవన్ తండ్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వరాలిస్తారా!

- పయ్యావుల పద్దుపై ఆశలు
- కలగా ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ
- పనులు చేస్తామని బాబు, పవన్ హామీ
- సాగని ఏలేరు-తాండవ ప్రాజెక్టు
- రూ.వెయ్యి కోట్లకు డెల్టా ప్రతిపాదనలు
- కోటిపల్లి రైల్వే లైన్‌లో పడేనా!
- కాకినాడ స్మార్ట్ సిటీ మాటేంటో..
- సూపర్ సిక్స్ హామీలకు ఎదురుచూపులు
- ఉమ్మడి తూర్పునకు వరాల జల్లు కురిసేనా

నేడే కూటమి బడ్జెట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి బడ్జెట్ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఎదురుచూస్తోంది. నేడు రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్న పద్దు జిల్లాకు నిధుల వరద కురిపిస్తుందని నిరీక్షిస్తోంది. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేక జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో జరిగిన నష్టానికి నిధుల విడుదలతో చికిత్స చేస్తారని ఆశిస్తోంది. వర్షాలు, వరదలు వస్తే ముంపులో చిక్కుకుపోయి ఏటా ఉమ్మడి జిల్లాలో అనేక నియోజకవర్గాలు విలవిల్లాడిపోతున్నాయి. ఏళ్లకు ఏళ్లు ముందుకు కదలకుండా కలగానే మిగులుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ నుంచి అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ, ఆచరణకు నోచుకోని ఏలేరు-తాండవ కాలువ లింకింగ్, పూర్తికాని పోలవరం ఎడమ ప్రధాన కాలువ వరకు ఎన్నో సమస్యలు కూటమి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులతో తిరిగి పునరుజ్జీవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికలకు ముందు, ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటికి నిధులిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇవ్వడంతో ఈ మేరకు కేటాయింపులుంటాయని అంతా ఆశిస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్.. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతులకు నిధుల కేటాయింపులు ఏ మేర ఉంటాయనేది చర్చ నీయాంశంగా మారింది.

ఏలేరుకు మోక్షం లభించేనా..

కాకినాడ జిల్లాలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేసేసింది. ఇక అప్పటి నుంచి ఏలేరు ఆధునికీకరణ పక్కకు పోయింది. దీంతో వర్షాలు, వరద వచ్చిన ప్రతిసారీ ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. గతేడాది వరదలకు ఐదు వేల ఎకరాలు నీటమునిగాయి. అప్పట్లో సీఎం జగన్ గొల్లప్రోలు పర్యటనకు వచ్చినప్పుడు ఏలేరు ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. పాత అంచనాలను సవరించి కొత్తగా సిద్ధంచేసిన రూ.663 కోట్ల అంచనాలకు మోక్షం కలగలేదు. అనేక బడ్జెట్‌లు వెళ్లిపోయినా ఆధునికీకరణకు డబ్బులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలుసార్లు ప్రస్తావించారు. దీంతో ఈ బడ్జెట్‌లో ఈ పనులకు నిధులు ఏమేరకు కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా సవరించిన అంచనాలు రూ.794 కోట్లకు చేరాయి.

డెల్టా..ఆధునికీకరణ సంగతేంటో..

కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన డెల్టా ఆధునికీకరణ సైతం మూలనపడిపోయింది. గడచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు వరదలతో కోనసీమ అతలాకుతలమైంది. ఏటిగట్ల పటిష్టత చేపట్టలేదు.ఇప్పుడు డెల్టా ఆధుని కీకరణకు రూ.వెయ్యి కోట్లపైనే ఖర్చు కానుంది. సెంట్రల్ డెల్టాకు కీలకమైన లొల్ల లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు తక్షణవసరంగా మారింది. రూ.470కోట్లతో ఏలేరు-తాండవ లింకు కాలువ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా పనులు టెండర్ల దశలోనే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 214 కిలో మీటర్లు ఉన్న ఈ కాలువ ద్వారా కాకినాడ జిల్లాలో 1.67 లక్షల ఎకరాలు, కోనసీమ జిల్లాలో 2,326 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 81 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.3,645 కోట్ల పనులకు 72.7 శాతం పనులు పూర్తికాగా వైసీపీ హయాంలో ఎక్కడికక్కడ మిగిలిన పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచి పూర్తి చేయాల్సి ఉంది.

తల్లికి వందనం.. ఆర్టీసీ ప్రయాణం..

తల్లికి వందనం మే నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధులు అవసరం. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మందికి మేలు కలగనుంది. దీంతో మహిళల్లోనూ బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది.

స్మార్ట్‌సిటీకి నిధులిస్తారా...

కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులు ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం కూడా తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ వైసీపీ హయాంలో నిధులు విడుదల చేయలేదు. అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

కోటిపల్లి కూత పెట్టేనా..

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను జగన్ సర్కారులో కలగా మారింది. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ ఈ లైను పూర్తి చేస్తామని కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్ర వాటా నిధుల కింద కేటాయింపులు జరగాల్సి ఉంది. దీంతో ఎన్ని నిధులు కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి 2001లో భట్నవిల్లి వద్ద శంకుస్థాపన చేసిన ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

'స్వర్ణాంధ్ర'లో అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు వద్ద స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అంతర్జాతీయ ఎన్జీవో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. అనూప్, జోషిబాబు, ప్రభుదాస్, పోసికుమార్, మద్దాల అను, శకుంతల, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 47,943

కొవ్వూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోష్పాద క్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి ద్వారా రూ. 47,943 ఆదాయం వచ్చినట్టు దేవాదాయశాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ బీఎల్ నరసింహరావు తెలిపారు. గురువారం ఆలయ సీఏఫ్‌వో వీ. శ్రీకృష్ణదేవి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు పడింది!

• ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్
• ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు • 3న ఫలితాలు

• కొవ్వూరు మండలంలో 66.05 శాతం • నిడదవోలులో 70.15 శాతం • తాళ్లపూడిలో 62.12 శాతం • చాగల్లులో 66 శాతం పైగా .. • నల్లజర్ల మండలంలో 74 శాతం • దేవరపల్లిలో 66.44 శాతం • ఉండ్రాజవరంలో 72.92 శాతం పోలింగ్ నమోదు


కొవ్వూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో డా. రాణీసుస్మిత

కొవ్వూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసినట్టు కొవ్వూరు ఆర్డీవో డా. రాణీసుస్మిత తెలిపారు. ఈ మేరకు స్థానిక గవర్నమెంట్, మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ సరళిని పరిశీలించి, ఎన్నికల సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈమె వెంట కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఉన్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో 4, గవర్నమెంట్ హైస్కూల్ ప్రాంగణంలో 2, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 2 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో 66.05శాతం పోలింగ్ నమోదయ్యింది. కొవ్వూరు పట్టణ, మండలంలో మొత్తం 5201 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 2857, మహిళలు 2344 మందికిగాను 3483 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1969, మహిళలు 1514 మంది ఓటువేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దేవరపల్లి మండలంలో ఓటుహక్కును వినియోగించుకోగా, కొవ్వూరు పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆంధ్రషుగర్స్ జేఏండీ పెండ్యాల అచ్చుత రామయ్య (అచ్చిబాబు), టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ద్విసభ్య కమీటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీ.వీ. రామారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు.

• జేసీ చిన్నరాముడు తనిఖీ

పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు పరిశీలించారు. గవర్నమెంట్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్‌లో ఉన్న ఎనిమిది పోలింగ్ బూత్‌లను తనిఖీచేసి అధికారులకు సూచనలు, సలహాలను అందజేశారు. క్యూలైన్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉన్న ప్రతిఒక్కరికీ నంబర్లు ఇచ్చి ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొవ్వూరు ఆర్డీవో డా.రాణీసుస్మిత, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పట్టణ సీఐ పీ.విశ్వం, తదితరులు ఉన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, జనసేన నియోజకవర్గ ఇంచార్జి టీవీ రామారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాస్, పిల్లలమర్రి మురళీకృష్ణ, టీవీ ముత్యాలరావు, మద్దిపాటి సత్యనారాయణ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో గురువారం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరిశీలించారు. మొత్తం ఐదు కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణ, మండల పరిధిలో పురుషులు 2241 మంది, మహిళలు 1711 మంది మొత్తం 3952 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1521, మహిళలు 1120 మొత్తం 2641 మంది ఓటు హక్కును వినియోగించుకు న్నట్టు తహశీల్దార్ నాగరాజు నాయక్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలయ్యే సరికి 66.83 శాతంగా నమోదయ్యింది.

తాళ్లపూడి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగి సింది. ఉదయం నుంచి మందకొడిగా సాగగా, మధ్యాహ్నం సమయానికి 40 శాతంగా నమోదయ్యింది. మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ముగిసే సమయానికి 1935 ఓట్లకు గాను 1260 ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. వారిలో పురుషులు 802 మంది కాగా, మహిళలు 458 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాళ్లపూడి మండలంలో మొత్తం 62.12 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికలో 35 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ చాలామందికి పోలింగ్ ఏజెంట్లు కూడా లేని పరిస్థితి నెలకొంది. అభ్యర్థి డా. తాళ్లూరి రమేష్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవో రాణీసుస్మిత, ఏఎస్పీ టీ.సుబ్బరాజు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సీఐ విజయబాబు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, రూట్ ఆఫీసర్ కె.రామకృష్ణ, పీవోడీబాబు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటుచేసిస్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు.

చాగల్లు: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 2618 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక హైస్కూల్లో రెండు, జూనియర్ బేసిక్ స్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీరిలో 1744 మంది ఓటు వేశారు. మొత్తం 66.62 శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సరళిని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానిక కూటమి నేతలతో కలిసి ఓటింగ్ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కూటమి నాయకులు కరుటూరి సతీష్, నందిగం శ్రీను, బొల్లిన శివ నాగేంద్ర, తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు, బొడ్డు రాజు, కోడూరి కాశి గంగాధరరావు, అబ్బూరి సీతారాముడు, తదితరులతో కలిసి మాట్లాడారు.

నల్లజర్ల: ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా 2,500 మంది ఓటర్లకు నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.హైస్కూల్ (285,287), నల్లజర్ల నెం1 (284,286) పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. 1859 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 74.35 శాతం ఓట్లు పోలైనట్టు తహశీల్దార్ నాయుడుపేర్కొన్నారు. నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. సీఐ రవిశంకర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

దేవరపల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై నాలుగు గంటలతో ముగిసింది. మొత్తం 2166 ఓట్లు ఉండగా, ఇందులో పురుషులు 911, మహిళలు 528 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 66.44 శాతం ఓట్లు నమో దైనట్టు తహశీల్దార్ కే.రాజ్యలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే మద్ది పాటి వెంకట్రాజు మాట్లా డుతూ ప్రజాస్వా మ్యంలో ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ప్రాథమిక పాఠశాల, జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిం చారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు కేఎస్ జవహర్, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అంగ్రూ అనీల్, టీడీపీ నాయకులు కొయ్యల మూడి చినబాబు, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, పెనుమత్స సుబ్బరాజు, బళ్లా సూర్యచక్రం, తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో క్యూ లైన్లో ఓటర్లను పరిశీలిస్తున్న తహశీల్దార్

ఉండ్రాజవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 72.92 శాతం ఓటింగ్ నమోదైంది. ఉండ్రాజవరం హైస్కూల్‌లో రెండు, స్థానిక నెం.1 పాఠశాలలో రెండు పోలింగ్ కేం ద్రాలు నిర్వహించారు. మండలంలో మొత్తం ఓట్లు 2651 కాగా, వీటిలో 1933 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1123 మంది, మహిళా ఓటర్లు 810 మం ది ఉన్నారు. 718 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఎన్నికలు ప్రశాతంగా జరిగేందుకు ఎస్సై జీ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఉండ్రాజవరం హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శేషారావు మాట్లాడుతూ ఓటింగ్ సరళితో కూటమి అభ్యర్థి విజయం ఖాయమని చెప్పారు.

గోపాలపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్టు ఏఈఆర్వో అజయ్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 259,260,261 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 1777 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా, 1194 మంది మాత్రమే వినియోగించుకున్నారు. మొత్తం 72.00 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో 736 మంది పురుషులు 458 మంది మహిళలు ఉన్నారు. రూట్ ఆఫీసర్ రాజు ఆధ్వర్యంలో పోలింగ్ బాక్సులను తరలించామన్నారు.

పెరవలి: మండలానికి సంబంధించి మూడు పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలలో రెండు, హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 373 పోలింగ్‌బూత్‌కు 775 మంది ఓటర్లను కేటాయించగా, హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 375 పోలింగ్‌బూత్‌లకు మాత్రం 455 మంది ఓటర్లను మాత్రమే కేటాయించారు. మండలంలో 73.15 శాతం నమోదయ్యింది.


తాళ్లపూడిలో దివ్యాంగ ఓటర్‌ను వీల్‌చైర్‌లో తీసుకుని వెళుతున్న సిబ్బంది


నిడదవోలులో ఓటేసిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ


కొవ్వూరులో బందోబస్తుపై ఆరా తీస్తున్న జేసీ చినరాముడు


ఉండ్రాజవరంలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే


గోపాలపురంలో బ్యాలెట్ బాక్సులను బస్సులో తరలిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబాలకు అచ్చిబాబు పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న నామా కొండబాబు

తాళ్లపూడి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాడిపూడిలో మహాశివరాత్రి రోజున ఐదుగురు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను నియోజకవర్గ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ సీఎండీ పెండ్యాల అచ్చిబాబు వెళ్లి పరామర్శించారు. స్థానిక నాయకుడు నామా కొండబాబు బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపి ఒక్కొక్క కుటుంబానికి రూ. 25 వేలు నగదును అందించారు. కంఠమణి రామకృష్ణ, జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, నామన పరమేశ్వరరావు, కాకర్ల సత్యేంద్ర, ఉప్పులూరి రమేష్, మద్దుకూరి శంకరం, కొఠారు వెంకట్రావు, నామా నరేంద్ర (నాని), నామా సురేంద్ర, తదితర కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

• మానవతా సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానవతా సంస్థ చైర్మన్ జనార్దనరావు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో కన్నా రక్తదానం మిన్న అని మానవతా సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు అన్నారు. స్థానిక మదనగోపాలస్వామి ఆలయంలో వచ్చేనెల 8వ తేదీన నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను గురు వారం ఆవిష్కరించారు. మానవతా సంస్థ, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో మానవతా సంస్థ మండలాధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్, డైరెక్టర్ గోకవరపు బాబులు, అప్పన హనుమంతరావు, ఆర్య వైశ్యసంఘ నాయకులు గోకవరపు సూరిబాబు, గోకవరపు మాణిక్యం, ఉమా, ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోరుమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు ఒకప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్, మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఆపుతున్నట్టు చెప్పారు.

• వాడపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ..


కొవ్వూరు: వాడపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లల్లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు నిడదవోలు డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. ముఖ్యంగా వాడపల్లి, తోగుమ్మి, వేములూరు, మద్దూరు, సీతంపేట, మద్దూరు లంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రాజశేఖర్‌దే విజయం : మంత్రి


కూటమి కార్యకర్తలను కలిసిన దుర్గేష్

పెరవలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పెరవలిలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం కూటమి నాయకులను కలుసుకునేందుకు వచ్చి మాట్లాడుతూ పోటీలో ఎంతమంది ఉన్నా.. ఉమ్మడి అభ్యర్థి రాజశేఖరానికి ఓటు వేశారన్నారు.

జనసేన నాయకుల పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న కృష్ణ, వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తాడిపూడిలో బుధవారం జరిగిన విషాద సంఘటన నేపథ్యంలో జనసేన పార్టీ ఉమ్మడి గోదావరి జిల్లాల కార్యదర్శి గాయత్రీ వెంకటేశ్వరరావు, తాళ్లపూడి జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ గురువారం వెళ్లి బాధిత కుటుంబాలను పరిమర్శించారు.కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు తిరుమలశెట్టి రామ్మూర్తి, గొంతు విష్ణుమూర్తి, చలపాటి వాసు, ఆటపాలకల శ్రీను, తదితర నాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ


పంపిణీ చేస్తున్న ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అవంతి ఫీడ్స్ అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ జన్మదినం సందర్భంగా వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. రామ్మోహన్ ఆధ్వర్యంలో పండ్లు. స్వీట్స్‌అందజేశారు. కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్ పాల్గొన్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

• గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, డెలివరీ బాయ్స్ సమావేశంలో జేసీ చినరాముడు


గ్యాస్ డెలివరీ ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ డెలివరీ కోసం వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీలను వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ చినరాముడు హెచ్చరించారు. జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలపై అందుతున్న ఫిర్యాదుల మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, డెలివరీ బాయ్స్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ సమయంలో బాయ్స్ అదనపు ఛార్జీలను వసూలు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, 15 కిలోమీటర్ల పరిధి లోపల ఉన్న ఏ వినియోగదారుడి నుంచి డీలర్ అదనంగా వసూలు చేయకూడదని స్పష్టంచేశారు. ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా, అదనపు ధర వసూలు చేసే అంశంపై గ్యాస్ ఏజెన్సీలు తమ డెలివరీ బాయ్స్‌ను హెచ్చరించాలని, లేకుంటే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తప్పవన్నారు. బాయ్స్ తప్పనిసరిగా వేయింగ్ మెషీన్ వెంట తీసుకెళ్లాలని, వినియోగదారుని కోరిక మేరకు సిలిండర్‌ను తూకం వేసి ఇవ్వాలని సూచించారు.

'సూపర్ సిక్స్' అమలుకు కూటమి కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే

రాజానగరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం ఆయన రాజానగరంలో పోలింగ్ ప్రక్రియపై కూటమి నాయకులతో కలిసి ఆరాతీశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం రహదారులను గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 4,300 కిలో మీటర్ల వేసిన ఘనత కూటమి ప్రభు త్వాదేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీసీరోడ్లు కూడా వేయలేకపోయారన్నారు. ఉచిత ఇసుక, నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి తక్కువ రేట్లకు నాణ్యమైన మద్యం విక్రయిస్తుందన్నారు.

'పల్ల' నర్సరీని సందర్శించిన ఇన్‌కంటాక్స్ డీజీ

కడియం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని గురువారం ఇన్‌కం టాక్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఐటీ అధికారుల బృందం సందర్శించారు. ఆయనకు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్‌లు మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ కడియం నర్సరీల గురించి తాను విన్నానని, అందుకే నర్సరీ సందర్శనకు వచ్చినట్టు తెలిపారు. దేశ, విదేశీ మొక్కలు ఒకేచోటు కడియం ప్రాంతంగా చెప్పవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీ సెంట్రల్ ప్రిన్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ సతీష్‌వర్మ, కేంద్ర ఇన్‌కం టాక్స్ అధికారులు కల్యాణ్ చక్రవర్తి, ఎల్.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.


నర్సరీని సందర్శిస్తున్న ఇన్‌కం టాక్స్ డైరెక్టర్ జనరల్

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



కొవ్వూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. బస్టాండ్‌లో ఇనుపకుర్చీలపై సుమారు 50 నుంచి 57 సంవత్సరాల మధ్య వయసున్న మగ వ్యక్తిగా నిర్ధారించారు. మృతుని ఒంటిపై ఎరుపు, పచ్చ, తెలుపురంగుల గళ్ల చొక్కా, తెలుపు, నీలంరంగు లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ 944079 66622, 08813-231100, 91548 75583 నెంబర్లకు సమాచారం అందించాలని సీఐ పీ.విశ్వం తెలిపారు.

రాజానగరం సీఐపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని భారతశక్తి పీఠం అధ్యక్షుడు, హిందూ మహాసభ దక్షిణ భారత కార్యనిర్వాహక కార్యదర్శి భారతానంద మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన గురువారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. భారతానంద మాట్లాడుతూ.. గోవుల అక్రమరవాణాకు పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపించారు. నిందితులకు రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ సహకరిస్తున్నారన్నారు. ఈనెల 26న ఏపీ 39యూఎక్స్ 0181 లారీలోని కంటెయినర్‌లో సుమారు 40 గోవులను రవాణా చేస్తున్నారనే సమాచారంతో హిందూ గోసేవా సమితి సభ్యులకు సమాచారం వచ్చిందని, వాళ్లు రవాణాను అ డ్డుకొని 112కి ఫోన్ చేసి అప్పగించారని చె ప్పారు. అయితే ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కి తరలించకుండా, హిందూ మనోభావాలు దెబ్బతినే విధంగా పోలీసులు ప్రవర్తించారని భారతానంద ఆరోపించారు.ఈ ఘటనపై ఎస్పీ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు ఎన్.ముత్యాలరావు, బొడ్డు వెంకటేష్ కుటుంబాలను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి పరామర్శించారు. జాలరిపేటలోని బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి యువకుల ముత్యాలరావు పరామర్శించి సంతాపం తెలిపారు. తన సొంత సొమ్ము రూ.లక్ష చొప్పున అందజేశారు. పార్టీ పరంగా, ప్రభుత్వం పరంగా రెండు కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.